పరిపాలనా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు

ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

చేబ్రోలు: దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని పొన్నూరు శాసన సభ్యుడు కిలారి వెంకట రోశయ్య అన్నారు. చేబ్రోలు మండలం నారాకోడూరు దళితవాడలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే కిలారి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. శాసన సభ్యుడు కిలారి వెంకట రోశయ్య మాట్లాడుతూ గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. కేంద్ర బృందాలు కూడా ప్రశంసలు తెలిపారన్నారు. పారదర్శకంగా 1.37 లక్షల మంది గ్రామ సచివాలయ సిబ్బందిని నియమించడం జరిగిందన్నారు. 2.70 లక్షల మంది వలంటీర్ల ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఇంటి వద్దకే వచ్చి అందిస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వ పథకాలు పేదలకు అందకుండా ప్రతిపక్షాలు కుట్రలు చేస్తున్నాయన్నారు. వలంటీర్ వ్యవస్థ రద్దుకు పథకం ప్రకారం విమర్శలు చేస్తున్నారన్నారు. ఎక్కడో ఒకచోట జరిగిన ఘటనను చూపి అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. సమావేశానికి వచ్చిన వారిలో ఎవరికైనా వలంటీర్ల వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారా అని ప్రశ్నించారు. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచటానికి నవరత్నాలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. వివిధ సాంకేతిక కారణాలు, ఇతర కారణాలతో సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించి వారికి లబ్ధి చేకూర్చటం కోసం జగనన్న సురక్ష పథకంను తీసుకురావడం జరిగిందన్నారు. దరఖాస్తుదారులకు ఉచితంగా ధృవీకరణ పత్రాలను అందజేస్తున్నట్లు తెలిపారు. కులాలు, మతాలు, పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను నాడు-నేడు ద్వారా అభివృద్ధి చేసినట్లు తెలిపారు. వివిధ రకాల సర్టిఫికెట్లను ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య చేతుల మీదుగా లబ్ధిదారులకు ఉచితంగా అందజేశారు. జీడీసీఎంఎస్ డైరక్టర్ కుర్రా పాములు, సొసైటీ అధ్యక్షుడు చందు సాంబశివరావు, తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, ఏపీఎం వి నాగేశ్వరరావు, పార్టీ నాయకులు కొక్కిలగడ్డ కిరణ్‌కుమార్, దాసరి రత్నరాజు, దానమ్మ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

రూ. 20 కోట్లతో నారాకోడూరు అభివృద్ధి, సంక్షేమం

నారాకోడూరు గ్రామాభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రూ.20 కోట్లు ఖర్చు చేసినట్లు ఎమ్మెల్యే కిలారి వివరించారు. రూ.కోటిన్నర వ్యయంతో జెడ్పీ హైస్కూల్ అభివృద్ధి, ప్రాథమిక పాఠశాలల అభివృద్ధి, దళితవాడలో సిమెంటు రోడ్లు, సైడ్ డ్రైయిన్లు, విద్యుత్ స్తంభాలు, రహదారుల నిర్మాణం జరిగిందన్నారు. సంక్షేమ పథకాల ద్వారా రూ.15కోట్లు ఖర్చు చేయటం జరిగిందన్నారు. రాష్ట్రంలో రెండు లక్షల 16వేల కోట్ల రూపాయిలు సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు లబ్ధి చేకూర్చినట్లు తెలిపారు.



నారాకోడూరులో జగనన్న సురక్ష కార్యక్రమంలో దరఖాస్తుదారులకు సర్టిఫికెట్లును అందజేస్తున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య



సమావేశానికి హాజరైన గ్రామస్తులు

జగనన్న సురక్ష పేదల రక్ష
జిల్లా పరిషత్ సీఈఓ మోహనరావు

గుంటూరు రూరల్: జగనన్న సురక్ష క్యార్యక్రమం పేదలకు రక్షణ కార్యక్రమం అని జిల్లా పరిషత్ సీఈఓ జె మోహనరావు తెలిపారు. శనివారం మండలంలోని ఓబులునాయుడుపాలెం గ్రామంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలు సద్వినియోగించుకోవాలన్నారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను ప్రజల ఇంటిముందుకు అందిస్తున్నాడన్నారు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలో 96 కుల ధ్రువీకరణ పత్రాలు, 107 ఆదాయ ధ్రువపత్రాలు, 14 మందికి ఆధార్ సేవలు, 2 ఇతర సేవలను అందించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి ఎల్ వజ్రశ్రీ, జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారి లక్ష్మణ్, మండల అభివృద్ధి అధికారిణి జె శోభరాణి, ఈవోపీఆర్‌డీ శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ కేశం శ్రీలక్ష్మి, కేశం హరనాథ్, గ్రామ సచివాలయం సిబ్బంది, వలంటీర్లు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షపై డోర్‌టు డోర్ క్యాంపెయిన్

గుంటూరు రూరల్: జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రజలకు సాంకేతిక లోపాలతోకూడిన సమస్యలను ఏవిధంగా పరిష్కరించుకోవాలి అనే అంశంపై మండలంలోని వెంగళాయపాలెం గ్రామంలో డోర్ టు డోర్ క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రజల ఇళ్లకు వలంటీర్లు వెళ్లి వారి సమస్యలు తెలుసుకుని వచ్చే వారంలో గ్రామంలో జరిగే జగనన్న సురక్ష కార్యక్రమంపై వివరించారు. ఆరోజు మండల స్థాయి అన్ని విభాగాల అధికారులు గ్రామానికి వచ్చి గ్రామ ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని సత్వరం పరిష్కరిస్తారని తెలిపారు.

సురక్షలో ఉచితంగా తొమ్మిది రకాల సర్వీసులు

వంగిపురం (ప్రత్తిపాడు): జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజలకు తొమ్మిది రకీల సర్వీసులను ఉచితంగా అందించడం జరుగుతుందని ఎంపీడీఓ ఏ. శ్రీరమ్య అన్నారు. మండల పరిధిలోని వంగిపురం గ్రామ సచివాలయం వద్ద శనివారం జగనన్న సురక్ష క్యాంపును నిర్వహించారు. వివిధ ధ్రువీకరణ పత్రాల కోసం టోకెన్లు తీసుకున్న లబ్ధిదారులకు ఉచితంగా ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో సదుద్దేశ్యంతో విద్యార్థులకు, రైతులకు ఈ సమయంలో కావలసిన ధ్రువీకరణ పత్రాలను ఎలాంటి నిర్నీత సర్వీసు చార్జీలు లేకుండా అందజేస్తుందన్నారు. అంతేకాకుండా అర్హత ఉన్న ఏ ఒక్కరూ పథకాలకు దూరంగా ఉండకూడదన్న ఉద్దేశ్యంతో, వలంటీర్లు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి పూర్తి వివరాలను సేకరిస్తున్నారని చెప్పారు కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పెదనందిపాడులో...

పెదనందిపాడు: ప్రజలకు ఉన్న సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష పథకం జరుగుతుందని, ఈ పథకం వల్ల అనేక ఉపయోగాలు ఉన్నాయని మండల ప్రత్యేక అధికారి మనోరంజని అన్నారు. శనివారం ఉదయం మండల పరిధిలోని పుసులూరు, అన్నవరం గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మనోరంజని మాట్లాడుతూ గతంలో పలు సమస్యల అందరికి అన్ని పథకాలు అందేవి కాదని, అలా కాకుండా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జగనన్న సురక్ష పథకం ప్రవేశపెట్టిందని ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె ప్రజలకు తెలియజేశారు. వివిధ దరఖాస్తుల కోసం పుసులూరు గ్రామంలో 520 మందికి అన్నవరం గ్రామంలో 340మందికి సర్టిఫికెట్‌లు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుభాని, ఎంపీడీఓ రాజగోపాల్, ఈఓపీఆర్డీ సాయిలీల, సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతతో జనం సుభిక్షం

టీకేపాలెం(కాకుమాను): జగనన్న సురక్ష కార్యక్రమంలో రాష్ట్రంలోని ప్రజలంతా సురక్షితంగా ఉన్నారని కాకుమాను జెడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్ బేగం అన్నారు. మండలంలోని బీకేపాలెం గ్రామ సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా గుల్జార్ బేగం మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజలకు గ్రామాల వద్దనే ప్రభుత్వ పథకాలను అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష అనే కార్యక్రమం చేపట్టినట్లు ఆమె తెలిపారు. మండల ప్రత్యేక అధికారి ప్రేమ కుమారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు దాదాపు 95 శాతం పథకాలను ప్రజలకు అందిచినట్లు మిగిలిన 5 శాతం ప్రజలకు ప్రభుత్వ పథకాలను అందించాలనే ఉద్దేశంతో కార్యక్రమం చేపట్టినట్లు ఆమె తెలిపారు. ఈసందర్భంగా 430 మందికి వివిధ రకాల సర్టిఫికెట్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మెరిగల శాంత కుమారి,వైఎస్ సర్పంచ్,వ్యవసాయ సలహా మండలి మండల కన్వీనర్ కొత్త అమేష్,మెరిగల మోహనరావు, తహసీల్దార్ జె.ప్రసాదరావు, ఎంపీడీఓ రామకృష్ణ, ఈఓపీఆర్డి జవహర్ లాల్ నెహ్రూ,వివిధ శాఖల అధికారులు,ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

పెదకాకానిలో జగనన్న సురక్ష

పెదకాకాని: అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల లబ్ధి అందించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని ఎంపీపీ తుల్లిమల్లి శ్రీనివాసరావు అన్నారు. పెదకాకాని సచివాలయం వద్ద విద్యార్థులు, మహిళలు, రైతులను దృష్టిలో ఉంచుకుని 11 రకాల ధ్రువీకరణ పత్రాలను శనివారం ఎంపీపీ తుల్లిమల్లి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ళ జ్యోతి, గ్రామ సర్పంచి గోళ్ళ స్వరూపరాణిల చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ తుల్లిమల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువ అవుతాయన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. కార్యక్రమాన్ని అర్హత కలిగిన లబ్ధిదారులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బివి మల్లేశ్వరరావు, మండల పార్టీ కన్వీనర్ చాగంటి మురళీమోహన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి అంగలకుదురు సాంబశివరావు, పలువురు అధికారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



పెదకాకానిలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ తుల్లిమల్లి శ్రీనివాసరావు




ప్రజలకు సర్టిఫికెట్లను అందజేస్తున్న జెడ్పీ సీఈఓ మోహనరావు



గ్రామంలో ప్రజల ఇళ్ల వద్ద జగనన్న సురక్ష కార్యక్రమంపై వివరిస్తున్న వలంటీర్లు

క్లుప్తంగా

సబ్సిడీపై జొన్న విత్తనాల పంపిణీకి సిద్ధం



పెదకాకాని: రైతులకు సబ్సిడీపై అందించేందుకు ప్రభుత్వం జొన్న విత్తనాలను అందుబాటులో ఉంచిందని శనివారం పెదకాకాని పశు వైద్యాధికారి డాక్టర్ సుబ్బారెడ్డి తెలిపారు. ఈ జొన్న విత్తనాలు సంవత్సరానికి మూడుసార్లు పశువులకు మేతగా ఉపయోగపడతాయన్నారు. కోత కోసిన వెంటనే పశుగ్రాసం తిరిగి పెరుగుతుందన్నారు. ఈ విత్తనాలు పెదకాకాని మండలంలోని వెనిగండ్ల రైతు భరోసా కేంద్రంలో అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ అవకాశాన్ని రైతు సోదరులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తుమ్మలపాలెం యూపీ పాఠశాలలో తనిఖీలు



తుమ్మలపాలెం (ప్రత్తిపాడు): మండల విద్యాశాఖాధికారి సీహెచ్ రమాదేవి శనివారం తుమ్మలపాలెం యూపి పాఠశాలలో తనిఖీలు నిర్వహించారు. పాఠశాలలో సబ్జెక్టు టీచర్లు సరిపడినంత మంది లేకపోవడం, ఉన్న టీచర్లు హిందీ, తెలుగు బోధించకపోవడంతో విద్యార్థులు టీసీలు తీసుకుని వేరే పాఠశాలకు వెళుతున్నారంటూ శుక్రవారం ఆ గ్రామస్తులు మండల విద్యావనరుల కార్యాలయానికి వచ్చి ఎంఈఓకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎంఈఓ పాఠశాల రికార్డులు పరిశీలించారు. విద్యార్థుల సంఖ్య, ఉపాధ్యాయుల సంఖ్యను పరిశీలించారు. విద్యార్థుల సంఖ్య ప్రకారం ఉపాధ్యాయులున్నట్లు నిర్ధారించారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మండలంలోని ఏదైనా పాఠశాల నుంచి ఒక ఉపాధ్యాయుడిని అడ్జెస్ట్‌మెంట్ కింద యూపి పాఠశాలకు పంపిస్తామని, అప్పటి వరకు విద్యార్థుల విద్యా ప్రమాణాలపై దృష్టి సారించాలని హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులను ఆదేశించారు. తొలుత పేరెంట్స్ కమిటీ సభ్యులతో మాట్లాడి, వారికి కూడా పరిస్థితిపై అవగాహ కల్పించారు.

బాలుడి కడుపులో నాలుగు అయస్కాంతాలు వెలికితీత



గుంటూరు మెడికల్: ఆటలాడుతూ ఆడుకునే వస్తువులను మింగి ప్రాణాపాయ స్థితికి చేరుకున్న ఓబాలుడికి యర్రాస్ హాస్పటల్‌లో అత్యంత క్లిష్టమైన ఆపరేషన్ చేసి బాలుడి ప్రాణాలు కాపాడామని పిల్లల శస్త్రచికిత్స నిపుణుడు డాక్టర్ యర్రా రాజేష్ చెప్పారు. శనివారం స్థానిక కొత్తపేటలోని యర్రాస్ హాస్పటల్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రకాశం జిల్లా మార్కాపురంకు చెందిన షేక్ హసీమ్‌వలి, శరాబ్బి దంపతుల తొమ్మిదేళ్ల కుమారుడు షేక్ మొహమ్మద్ రఫీని ఈనెల 8న చికిత్స కోసం ఆసు పత్రికి తీసుకొచ్చారన్నారు. బాలుడికి కడుపులో నొప్పి, పసరు వాంతులు అవడంతో మార్కాపురం, ప్రకాశం జిల్లాలోని పలు ఆసుపత్రుల్లో వైద్యులు పరీక్షలు చేసి తమ వద్దకు రిఫర్ చేశారన్నారు. బాలుడికి ఎక్సరే, అల్ట్రాసౌండ్ పరీక్ష చేయగా, కడుపులో నాలుగు అయస్కాంతాలు ఒకదానికొకటి అత్కుని ఉండటం గుర్తించామన్నారు. అయస్కాంత శక్తి వల్ల పేగు మెలిక పడి ఉందని, అత్యవసరంగా ఆపరేషన్ చేయాలని నిర్ణ యించామన్నారు. ఈనెల 8న సుమారు 2 గంటల సేపు ఆపరేషన్ చేసి చిన్నపేగులో మూడు చోట్ల, పెద్దపేగులో ఒకచోట అయస్కాంత ఆకర్షణ వల్ల రంధ్రాలు పడి ఉండటాన్ని గమనించామన్నారు. మొత్తం నాలుగు రంధ్రాలను బాగు చేశామన్నారు. రంధ్రాలు పడడంతో పాటు పేగుల్లో పలురకాల ప్లాస్టిక్, రబ్బరు వస్తువులు, విత్తనాలు సైతం బాలుడి కడుపులో ఉన్నాయన్నారు. లోపల ఉన్న వస్తువులన్ని బయటకు తీసి పేగును సరిచేశామన్నారు. సకాలంలో ఆపరేషన్ చేయకపోతే పేగులు పూర్తిగా పాడై పిల్లాడి ప్రాణాలకు ప్రమాదం ఏర్పడేదన్నారు. సుమారు నెలక్రితం బాలుడు బటన్ బ్యాటరీలు మింగాడని, తల్లిదండ్రులు మోషన్ ద్వారా బయటకు వస్తాయని నిర్లక్ష్యం చేసి చివరి దశలో తమ వద్దకు వచ్చారన్నారు. ఎండోస్కోపి ద్వారా తీయలేని పరిస్థితుల్లో మాత్రమే ఆపరేషన్ చేసి కడుపులో ఉన్న వస్తువులు బయటకు తీశామన్నారు.

శివాలయం అభివృద్ధి ప్రతి ఒక్కరి బాధ్యత

ఆలయ చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు

పెదకాకాని: శివాలయం అభివృద్ధే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ బాధ్యతగా విధులు నిర్వహించాలని ఆలయ చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు అన్నారు. పెదకాకాని శ్రీ భ్రమరాంబమల్లేశ్వరస్వామి దేవస్థానం నూతన పాలకమండలి తొలి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కార్యనిర్వహణాధికారి యస్ శ్రీనివాస రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ధర్మకర్తల మండలి చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు మాట్లాడుతూ ప్రభుత్వం, దాతల సహకారంతో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేయాలని, ముఖ్యంగా పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. అనంతరం అర్చకస్వాములు, సిబ్బంది పరిచయ కార్యక్రమం జరిగింది. సిబ్బంది వారి విధులను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు, ధర్మకర్త మండలి సభ్యులు గజ్జల సుబ్బాయమ్మ, తోట రవీంద్ర, కారంకి నాగేశ్వరమ్మ, గుమ్మల వెంకటరావు, చీడిపూడి అరుణ, పాలడుగు వెంకటేశ్వరరావు, మందాళ జ్యోతి, కాట్రోతు పార్వతి, ఎక్స్ అఫీషియో సభ్యుడు పాత్తూరి లక్ష్మీనారాయణ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు, ఏసి ఎన్ శ్రీనివాసరెడ్డి, పాలకవర్గం సభ్యులు

ఆశ కార్యకర్తలు ప్రతి రోజూ హాజరు వెయ్యాల్సిందే

జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ శ్రవణ్‌బాబు

ప్రత్తిపాడు: ఆశ కార్యకర్తలు ప్రతి రోజూ అటెండెన్స్ రిజిస్టరులో హాజరు వేయాల్సిందేనని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఏ. శ్రవణ్‌బాబు అన్నారు. నియోజకవర్గ కేంద్రంలోని ప్రత్తిపాడు-3 గ్రామ సచివాలయాన్ని శనివారం ఉదయం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్లు, వెల్‌నెస్ సెంటరులోని మందులతో పాటు పలు రికార్డులు పరిశీలించారు. అటెండెన్స్ రిజిస్టర్లులో ఆశ కార్యకర్తల సంతకాలు లేకపోవడంతో ఇదేమని ప్రశ్నించారు. కచ్చితంగా ప్రతి రోజూ ఆశ కార్యకర్తలు తమ హెల్త్ వెల్‌నెస్ సెంటరులో హాజరు వేయాలన్నారు. అదేవిధంగా సచివాలయ ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిలు కూడా వెల్‌నెస్ సెంటరులో హాజరు వేసిన తరువాతనే ఫీల్డ్‌కి వెళ్లాలని ఆదేశించారు. ఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పిలు సమన్వయంతో కలిసి పని చేసుకుంటేనే మంచి ఫలితాలు వస్తాయన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తున్నారన్నారు. గ్రామాల్లో ఇంటికే వెళ్లి వైద్యమందించే సేవలు ఏపీలో మాత్రమే ఉన్నాయని, గ్రామీణ ప్రాంత ప్రజలకు ఇదొక సువర్ణఅవకాశమని చెప్పారు. సచివాలయ ఏఎన్‌ఎంలు, ఆశాలు, ఎంఎల్‌హెచ్‌పిలు ప్రజల వద్దకు వెళ్లి వారికి ప్రభుత్వం అందిస్తున్న వైద్యసేవలను వివరిస్తూ, ఎప్పటికప్పుడు వారి ఆరోగ్యంపై అప్రమత్తం చేస్తూ ఉండాలన్నారు. వెంట హెచ్‌ఎస్ నిర్మల తదితరులున్నారు.



సచివాలయంలోని మాత్రలను పరిశీలిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఏ. శ్రవణ్‌బాబు

డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ సాంస్కృతిక భవనం ప్రారంభోత్సవం

పెదకాకాని: డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ సాంస్కృతిక భవనం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆదివారం సాయంత్రం 5 గంటలకు జరుగుతుందని గ్రామ సర్పంచ్ గోళ్ళ స్వరూపరాణి తెలిపారు. పెదకాకాని అంబేద్కర్‌నగర్‌లో రూ. 35 లక్షలు రాజ్యసభ సభ్యులు ఆళ్ళ అయోధ్యరామిరెడ్డి నిధులతో డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ సాంస్కృతిక భవనం నిర్మించారు. ఈ భవన ప్రారంభోత్సవ కార్యాక్రమానికి ముఖ్యఅతిథులుగా రాజ్యసభ సభ్యులు ఆళ్ళ అయోధ్య అరామిరెడ్డి, పొన్నూరు శాసన సభ్యులు కిలారి వెంకట రోశయ్య, గుంటూరు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ రావు తదితరులు విచ్చేయుచున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి మండల, గ్రామ, స్థానిక నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని సర్పంచి గోళ్ళ స్వరూపరాణి కోరారు.

ముగిసిన ఉపాధ్యాయుల డిజిటల్ శిక్షణ



డిజిటల్ స్క్రీన్‌పై ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్న అధ్యాపకులు

గుంటూరు రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు డిజిటల్ టెక్నాలజీతో విద్యా బోధన చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమం విద్యార్థులకు వరమని జీవీఆర్‌ఎస్ ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ షేక్ కరిమున్నిసా తెలిపారు. శనివారం మండలంలోని బుడంపాడు గ్రామంలోగల కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నాడు -నేడు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థులకు డిజిటల్ పాఠాలను బోధించనున్నారన్నారు. కార్యక్రమంలో భాగంగా ఉపాధ్యాయులకు ఈనెల 3వ తేదీనుంచి నేటి వరకూ ప్రత్యేక డిజిటల్ శిక్షణ తరగతులను నిర్వహించడం జరిగిందన్నారు. డిజిటల్ టెక్నాలజీతో విద్యా బోధన చేసే పద్ధతులు, వినియోగించే విధానం, విద్యార్థులకు సులువుగా అర్థమయ్యేరీతిలో ఏవిధంగా బోధించాలి తదితర సాంకేతిక నైపుణ్యతలను అధ్యాపకులు కె శ్రీనివాస్, కరిముల్లాలు వివరించడం జరిగిందన్నారు. శిక్షణ ఇచ్చిన అధ్యాపకులను అభినందించి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె రమేష్‌బాబు, డీన్ డాక్టర్ బి వరప్రసాద్, డిప్లమో ప్రిన్సిపల్ డాక్టర్ కె కుశల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌కు వస్తూ.. ఆధార్ కార్డు తెచ్చుకోండి

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో అవుట్ పేషెంట్ విభాగంలో వైద్య సేవలు పొందేందుకు వచ్చే రోగులు తప్పనిసరిగా ఆధార్ కార్డు తెచ్చుకోవాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ అన్నారు. తద్వారా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకాలు రోగులకు త్వరితగతిన అందేందుకు దోహదపడుతోందన్నారు. శనివారం ఆసుపత్రిలో ఓపీ కౌంటర్‌లను పరిశీలించారు. రిజిస్ట్రేషన్ కౌంటర్‌లో రోగులు తమ పేర్లు నమోదు చేసుకోవడంలో జాప్యాన్ని నివారించేందుకు ఆధార్ కార్డులు తప్పనిసరిగా తెచ్చుకోవాలన్నారు.

దాతలు ముందుకు రావాలి

ఆసుపత్రి అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ కోరారు. జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ హరిహరనాథ్ సమక్షంలో రూ.40 వేలు విలువ చేసే ఔషధాలను శనివారం సూపరింటెండెంట్ అందజేశారు. ఆసుపత్రిపై ఉన్న మమకారంతో రోగులకు ఉచితంగా అందజేందుకు మందులు అందజేసిన డీఆర్‌డీఏ అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఆసుపత్రిలో 30 ఏళ్లుగా ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్న ఉస్మాన్ ట్యూబ్‌లైట్లు ఆసుపత్రికి బహూకరించడంతో డాక్టర్ కిరణ్‌కుమార్ సదరు ఉద్యోగిని అభినందించారు.

విభజనతో దగాపడిన ఆంధ్రులను మేలుకొలుపుదాం

గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్ర విభజనతో దగాపడిన ఆంధ్రులను మేలుకొలుపు దామని జై ఆంధ్ర ఉద్యమ సంస్థ నాయకులు జై ఆంధ్ర వైవీఎస్ మహదేవ పిలుపునిచ్చారు. శనివారం మార్కెట్ సెంటర్లోని హిందూ కళాశాల ఏకాదండయ్య సమావేశ మందిరంలో జై ఆంధ్ర ఉద్యమ సంస్థతో పాటు పలు ప్రజాసంఘాల నాయకులు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ప్రొఫెషనల్ ఫోరం అధ్యక్షుడు నేతి మహేష్ కుమార్, పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సంఘం నాయకులు రంజిత్ కుమార్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రజల జీవనాడి పోలవరం ప్రాజెక్టు నిర్వీర్యం చేసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న దగాను ప్రజలు గమనిస్తున్నారని, ప్రజా ఆందోళనలే సమస్యలకు పరిష్కారమని చెప్పారు. గంగవరం పోర్టు బాధితుల సంఘం వై.అప్పారావు పాల్గొన్నారు.

ఉచితంగా ఐదుగురు చిన్నారులకు ప్లాస్టిక్ సర్జరీ

గుంటూరు మెడికల్: ప్రపంచ ప్లాస్టిక్ సర్జరీ డేను పురస్కరించుకుని శనివారం గుంటూరు అరండల్‌పేట పదోలైనులోని అమేజ్ మెడ్‌స్పా అండ్ ప్లాస్టిక్ సర్జికల్ సెంటర్‌లో డాక్టర్ సుమితా శంకర్ ఆధ్వర్యంలో ఐదులురు చిన్నారులకు ఉచితంగా ఆపరేషన్ చేశారు. శనివారం స్థానిక అరండల్‌పేటలోని ఆసుపత్రిలో జరిగిన విలేకరుల సమావేశంలో డాక్టర్ సుమితా శంకర్ మాట్లాడుతూ గ్రహణం మొర్రితో బాధపడుతున్న ఇరువురు చిన్నారులు, నరాల సమస్యతో బాధపడుతున్న చిన్నారికి, రక్తనాళాల్లో కణితో బాధపడుతున్న చిన్నారికి, కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న చిన్నారికి ఒక్కొక్కరికీ సుమారు రూ. లక్ష ఖరీదు చేసే ఆపరేషన్‌లు ఉచితంగా చేసి మందులు కూడా అందజేసినట్లు డాక్టర్ సుమితా శంకర్ చెప్పారు. ప్లాస్టిక్ సర్జరీ అంటే కాస్మొటిక్ సర్జరీ మాత్రమే కాదని, పాస్టిక్ సర్జరీపై వైద్య నిపుణుల్లో సైతం సరైన అవగాహన లేదన్నారు. ప్రతి ఇంటికి ప్లాస్టిక్ సర్జరీ చేరవేయాలనే లక్ష్యంతో అందరికీ అందుబాటులో ఉండేలా తమ సెంటర్‌లో వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ఆపరేషన్ ప్రక్రియలో డాక్టర్ సాధనాల నిశాంత్ పాల్గొన్నట్లు వెల్లడించారు.